# అక్షర దర్బార్

www.aksharadarbar.com


Voice of the people

గురువారం 21, మే 2026 | సంపుటి :03 | సంచిక :103 | పేజీలు :05 | వెల ₹5


## ప్రేమోన్మాది నాగరాజుకు
# మరణ శిక్ష ఖరారు

- రెండేళ్ల క్రితం దంపతుల దారుణ హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు
- తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తున్న బాధిత తండావాసులు

02



## కాళేశ్వర తీరంలో
# ఆధ్యాత్మిక శోభ

**నేటి నుంచి సరస్వతీ అంత్య పుష్కరాలు**

- కంచి పీఠాధిపతి తొలి పుణ్యస్నానంతో ప్రారంభం
- 12 రోజుల పాటు త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక వైభవం

దక్షిణ గంగగా కీర్తించబడే కాళేశ్వర క్షేత్రం పుష్కర శోభను సంతరించుకుంది. భక్తజన కోటి ఎంతగానో ఎదురుచూస్తున్న 'సరస్వతీ అంత్య పుష్కరాలు' నేటి (మే 21) నుండి వైభవంగా ప్రారంభం కానున్నాయి. జూన్ 1వ తేదీ వరకు 12 రోజుల పాటు ఈ పుష్కర మహోత్సవాలు నిరంతరాయంగా సాగుతాయి. ఈ పవిత్ర పుష్కర స్నానాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 30.63 కోట్ల నిధులను కేటాయించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేసింది. పుష్కరాల తొలిరోజైన గురువారం తెల్లవారుజామున 5.43 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారు సరస్వతీ నదిలో తొలి పుణ్యస్నానం ఆచరించి, ఈ అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. 12 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ఒక ప్రముఖ పీఠాధిపతి పాల్గొని నదీ స్నానం చేయనున్నారు. నిత్యం ఉదయం వేళల్లో పవిత్ర హోమాలు, సాయంత్రం వేళల్లో నదీ మాతకు మహదా హారతి, తెప్పోత్సవంతో పాటు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. - అక్షరదర్బార్, కాళేశ్వరం

05



# ఆర్ఈహెచ్ కు మహర్దశ

- వంద పడకలకు పెంచాలని నివేదిక పంపేందుకు నిర్ణయం
- అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ
- రూ.1.73 కోట్లతో అత్యాధునిక పరికరాలు ప్రారంభం

03






# పీఎస్ లో ఏసీబీ కలకలం

రూ. 30 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన మహిళా ఎస్సై!

06

# ప్రభుత్వ భూమి కబ్జా యత్నం భగ్నం!

- రూ. కోట్ల విలువైన బంచరాయి భూమిని కాపాడిన అధికారులు
- నిందితులపై సుబేదారి పీఎస్‌లో కేసు నమోదు

06



# పంట వ్యర్థాలను కాల్చవద్దు

- మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి
- పొగతో ఘోర ప్రమాదాలు.. భూసారానికీ తీవ్ర నష్టం



అక్షరదర్బార్, పరకాల: పంట కోతల అనంతరం వ్యర్థాలను కాల్చకుండా రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించాలని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు. నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామ సమీపంలో పంట పొగ వల్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందడంపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల ఉత్పత్తయ్యే దట్టమైన పొగ, విషవాయువులు రహదారులపై కమ్ముకుని ప్రమాదాలకు దారితీస్తున్నాయన్నారు. దీనివల్ల పర్యావరణానికే కాకుండా, నేలలోని సూక్ష్మజీవులు మరియు పోషకాలు నశించి భూసారం పూర్తిగా తగ్గిపోతుందని వివరించారు. పంట వ్యర్థాలను తగులబెట్టకుండా రోటవేటర్‌తో భూమిలో కలియదున్ని, డీకంపోజర్లు చల్లడం ద్వారా ఎకరాకు కేవలం రూ. 300 వ్యయంతోనే నాణ్యమైన సేంద్రియ ఎరువుగా మార్చుకోవచ్చని తెలిపారు. రైతులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లలో 'తరుగు-తేమ' దోపిడీని అరికట్టాలి


- పరకాల తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేత

అక్షర దర్బార్, పరకాల: ఐకేపీ, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని, 'తరుగు–తేమ' పేరుతో రైతులపై జరుగుతున్న దోపిడీని అరికట్టి యుద్ధప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ పరకాల అర్బన్, రూరల్ మండలాల అధ్యక్షులు గాజుల నిరంజన్, కసగాని రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పరకాల తహసీల్దార్ విజయలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాజుల నిరంజన్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కాంటాలు, గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. తేమ, తాలు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న దళారులు, అవకతవకలకు పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అకాల వర్షాల వల్ల పంట తడిసిపోకుండా తార్పాలిన్లు ఏర్పాటు చేయాలని, ధాన్యం విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతుల తరఫున బీజేపీ పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంగ పురుషోత్తం, గుండెబోయిన నర్సయ్య, జంగిలి రాజేందర్‌రావు, బాబూయాదవ్, దయ్యాల దేవరాజ్, ఎదునూరి లింగయ్య, కోరే సురేష్, జన్ను లింగయ్య పాల్గొన్నారు.



# ప్రేమోన్మాది నాగరాజుకు మరణ శిక్ష ఖరారు

- రెండేళ్ల క్రితం దంపతుల దారుణ హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు
- తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తున్న బాధిత తండావాసులు



అక్షర దర్బార్, నర్సంపేట: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో రెండేళ్ల క్రితం అర్ధరాత్రి వేళ ఓ ప్రేమోన్మాది జరిపిన కిరాతక దాడిలో నిండు దంపతులు బలియిన ఘటనలో నిందితుడికి కోర్టు మరణ శిక్ష ఖరారు చేసింది. వివరాల్లోకి వెళితే.. చెన్నారావుపేట మండలానికి చెందిన బానోతు శ్రీను, సుగుణ దంపతుల కుమార్తె దీపిక, గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన మేకల నాగరాజు అలియాస్ బన్నీ 2023లో ప్రేమించుకున్నారు. తల్లిదండ్రులను కాదని గతేడాది నవంబర్‌లో ఇల్లు వదిలి వెళ్లి వివాహం చేసుకుని హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. అయితే కొద్దిరోజులకే వీరి మధ్య మనస్పర్థలు రావడంతో జనవరిలో యువతి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఏకాభిప్రాయం ప్రకారం దీపిక తన తల్లిదండ్రులతో వెళ్ళిపోయింది. దీపికకు ఆమె తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారనే సమాచారం తెలుసుకున్న మేకల నాగరాజు రగిలిపోయాడు. 2024 జూలై 10 వ తేదీ బుధవారం రాత్రి మద్యం తాగి, కత్తి తీసుకుని యువతి ఇంటికి వెళ్లాడు. అక్కడ రేకుల షెడ్డు కింద నిద్రిస్తున్న తల్లి బానోతు సుగుణ, తండ్రి బానోతు శ్రీనులపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. అరుపులు విని ఇంట్లో ఉన్న అక్కాతమ్ముళ్లు బయటకు రాగా వారిపై కూడా దాడికి పాల్పడ్డాడు. తండావాసులు అక్కడికి చేరుకోవడంతో నాగరాజు పారిపోయాడు. ఈ దాడిలో సుగుణ అక్కడికక్కడే చనిపోగా, శ్రీను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన యువతి తమ్ముడు చికిత్స పొంది ప్రాణాలతో బయటపడ్డాడు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ఇద్దరు పిల్లల సాక్ష్యాలు, పోలీసుల పక్కా ఆధారాలతో నేడు కిరాతకుడు నాగరాజుకు కోర్టు ఉరిశిక్ష విధించడంతో తండావాసులు మరియు బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పొలాల పొగ ముంచిన ప్రాణం

- బొలెరో ఢీకొని యువకుడు దుర్మరణం
- దామెర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు




అక్షర దర్బార్, నడికూడ: రోడ్డు పక్కన ఉన్న పొలాల్లో మొక్కజొన్న పంట వ్యర్థాలకు మంటలు పెట్టడంతో రహదారిపై దట్టంగా కమ్ముకున్న పొగ కారణంగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ దురదృష్టకర ఘటన దామెర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ మండలం రామకృష్ణాపూర్ గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం రోడ్డు పక్కన ఉన్న మొక్కజొన్న పంట పొలాల్లో వ్యర్థాలకు మంటలు అంటించడంతో రహదారిపై దట్టమైన పొగ వ్యాపించి దారి కనిపించకుండా పోయింది. అదే సమయంలో నడికూడ గ్రామానికి చెందిన ఆకారపు క్రాంతికుమార్ (33) తన మోటార్‌సైకిల్‌పై హనుమకొండకు వెళ్తుండగా, ఎదురుగా హనుమకొండ నుంచి కంఠాత్మకూర్ వైపు వస్తున్న బొలెరో ట్రాలీ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్రాంతికుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బొలెరో వాహనాన్ని వెంకటాపూర్‌కు చెందిన ముక్కుల వినయ్ అతివేగంగా, అసమగ్రంగా నడిపినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మృతుడి తండ్రి ఆకారపు సుధాకర్ ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు దామెర ఎస్సై కొంక అశోక్ కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## ధాన్యం అన్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఎస్సై పోచంపల్లి సతీష్
- రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీ
- రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశం

అక్షర దర్బార్, చిట్యాల: కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు వస్తున్న ధాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వెంటనే అన్‌లోడ్ చేయాలని రైస్ మిల్లర్లను చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులకు వస్తున్న ధాన్యం లారీలు, ట్రాక్టర్ల దిగుమతి ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. అనంతరం రైస్ మిల్లు యజమానులతో, ధాన్యం దిగుమతి చేసే కూలీలతో ఎస్సై మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మిల్లుల వద్ద ఎక్కువ సేపు వేచి ఉంచకుండా వెంటనే అన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుత ఎండల తీవ్రత దృష్ట్యా రైతులకు త్రాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని, వారిని అనవసరంగా వేచి ఉంచవద్దని మిల్లు యజమానులకు సూచించారు. కూలీలు, మిల్లు సిబ్బంది సమన్వయంతో పనిచేసి దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ నిఘా ఉంచుతుందని ఎస్సై పోచంపల్లి సతీష్ ఈ సందర్భంగా తెలిపారు.




## ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

- సీఐ సుధాకర్ రెడ్డి
- ప్రగతి సింగారంలో రూ. 25 వేల విలువైన సోలార్ కెమెరాల డెమో




అక్షర దర్బార్, శాయంపేట: శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం ప్రతి గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని శాయంపేట సీఐ సుధాకర్ రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో బోనెపల్లి రఘుపతి రెడ్డి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, రూ. 25 వేల విలువైన నాలుగు సోలార్ సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు సమకూర్చారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై పరమేష్ సమక్షంలో సీసీ కెమెరాల పనితీరుపై డెమోన్‌స్ట్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, గ్రామ పెద్దలు, ప్రజలు వీటి ఏర్పాటులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.




## కంచి పీఠాధీశ్వరులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామికి ఘన స్వాగతం

- పరకాలలో పూర్ణకుంభం, మంగళహారతులతో ఆహ్వానం.. బైక్ ర్యాలీతో వీడ్కోలు

అక్షరదర్బార్, పరకాల: కంచి కామకోటి పీఠాధీశ్వరులు శ్రీ శ్రీ జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతీ స్వామికి పరకాల పట్టణంలో భక్తులు బ్రహ్మరథం పట్టారు. కాళేశ్వర క్షేత్రంలో ప్రారంభం కానున్న సరస్వతి అంత్య పుష్కరాలకు వెళ్తున్న సందర్భంగా పరకాల పట్టణంలో భక్తులు స్వామివారికి ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని కుంకుమేశ్వర ఆలయ అర్చకులు కోమాళ్లపల్లి సంపత్ శర్మ పూర్ణకుంభంతో స్వామివారిని భక్తిశ్రద్ధలతో ఆహ్వానించారు. కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం పట్టణ ప్రజలు, భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఆశీర్వాద కార్యక్రమం అనంతరం నూతన ప్రభుత్వ ఆసుపత్రి నుంచి చలివాగు వరకు భక్తులు భారీ బైక్ ర్యాలీతో శోభాయాత్ర నిర్వహించి స్వామివారికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ భక్తులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని చాటుకున్నారు.



# అయ్యో పాపం ఉపాధి కూలీలు

- రోజుల తరబడి కష్టపడితే హాజరు మాయం!
- కాట్రపల్లిలో ఆన్‌లైన్‌లో 'సున్నా' చూపించడంతో కూలీల ఆవేదన
- గతంలోనూ ఇంతే.. ఇది కావాలని చేస్తున్న కుట్రేనని కూలీల ఆరోపణ
- ఉన్నతాధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్



అక్షర దర్బార్, శాయంపేట: ఉపాధి హామీ పథకంలో సాంకేతిక లోపాలు లేదా అధికారుల నిర్లక్ష్యం కారణంగా శాయంపేట మండలం కాట్రపల్లి గ్రామంలో కొంతమంది ఉపాధి కూలీల ఆన్‌లైన్ పని హాజరు మాయమవడంతో కూలీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూలీలు 10 రోజులకు పైగా కష్టపడి పని చేస్తే.. ప్రతి కూలీకి కేవలం 3 నుండి 4 రోజుల హాజరు మాత్రమే పడిందని, మరికొందరికి ఆన్‌లైన్‌లో ఏకంగా 'జీరో' (0) చూపించడంతో కూలీలు ఆవేదనతో రోడ్డున పడ్డారు. రోజుల తరబడి మండుటెండల్లో కష్టపడి పనిచేసినప్పటికీ, ఆన్‌లైన్ రికార్డుల్లో (మస్టర్‌లో) పేర్లు లేకపోవడం లేదా హాజరు మాయం కావడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. గతంలో కూడా ఇలాగే తమ హాజరు మాయమైతే అధికారులకు ఫిర్యాదు చేశామని, మళ్లీ ఇప్పుడు కూడా అదే పునరావృతం కావడంతో ఇది కావాలనే కుట్రపూరితంగా చేస్తున్న చర్యేనని కూలీలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. 15 రోజుల నుండి గడ్డపారలతో నేలను తవ్వుతూ కష్టపడి పనిచేసి, తీరా చూసే సరికి మస్టర్‌లో పేర్లు లేకపోవడం మరియు ఆన్‌లైన్‌లో 'సున్నా' చూపించడంతో కూలీలు రోడ్డుపైనే కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ క్రమంలో పని ప్రదేశానికి చేరుకున్న ఏపీఓ కూలీలతో మాట్లాడుతూ.. తాను ఈ మండలంలో గత తొమ్మిది సంవత్సరాలుగా పనిచేస్తున్నానని, ఎక్కడా ఇలాంటి సమస్య రాలేదని పేర్కొన్నారు. అనంతరం రాబోయే 24వ తారీఖు నుండి మళ్లీ వర్క్ డిమాండ్ పెడతానని ఆయన కూలీలకు హామీ ఇచ్చినప్పటికీ, తమకు జరిగిన నష్టానికి సమాధానం చెప్పాలంటూ కూలీలు శాంతించలేదు. కష్టపడి పనిచేసిన రోజులకు డబ్బులు రాకపోతే తమ కుటుంబాలు ఎలా గడవాలని కూలీలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కాట్రపల్లి గ్రామ ఉపాధి కూలీలు పనిచేసిన పనిదినాలకు ఏవిధంగా న్యాయం చేస్తారో, సాంకేతిక లోపాలను ఎలా సరిచేస్తారో వేచి చూడాల్సిందే.


## జనగణన ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్ ప్రవీణ్ కుమార్

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలంలోని కొప్పుల, ప్రగతి సింగారం గ్రామాలలో ముమ్మరంగా కొనసాగుతున్న జనగణన (సెన్సస్) గృహాల జాబితా ప్రక్రియను తహసీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న హౌస్ లిస్టింగ్ పనులను నిశితంగా పరిశీలించిన ఆయన, ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్లకు పలు కీలక సూచనలు చేశారు. ప్రతి ఇంటికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా సేకరించి నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. జనగణన ప్రక్రియలో ఖచ్చితత్వం, పూర్తి వివరాల నమోదు అత్యంత ముఖ్యమని తహసీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# ఆర్ఈహెచ్ కు మహర్దశ

- వంద పడకలకు పెంచాలని నివేదిక పంపేందుకు నిర్ణయం
- అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ
- రూ.1.73 కోట్లతో అత్యాధునిక పరికరాలు ప్రారంభం




అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య ఆసుపత్రి (ఆర్ఈహెచ్) స్థాయిని 75 పడకల నుంచి 100 పడకలకు పెంచాలని ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్డీఎస్) నిర్ణయించింది. ఈ ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా రూ.75 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. అనంతరం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 75 పడకల సామర్థ్యాన్ని 100 పడకలకు పెంచడంతో పాటు మూడో దశ విస్తరణలో భాగంగా ఆసుపత్రిలో కార్నియా, గ్లాకోమా, రెటినా, స్క్వింట్ విభాగాల యూనిట్లను 4 నుండి 6కు పెంచేందుకు నిర్ణయించింది. ఆరోగ్యశ్రీ రివాల్వింగ్ ఫండ్ ద్వారా రూ.1.73 కోట్లతో అత్యాధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలిపింది. భద్రత, పారిశుధ్యం, పేషెంట్ కేర్ సిబ్బందిని 32 నుండి 62 మందికి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఖాళీగా ఉన్న టెక్నికల్, నాన్-టెక్నికల్ పోస్టులను ఏజెన్సీ ద్వారా కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయాలని నిర్ణయించింది. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులను పెంపొందించేందుకు, ఆసుపత్రి ప్రాంగణంలో వాణిజ్య దుకాణాలను నిర్మించి అద్దెకు ఇవ్వాలనే ప్రతిపాదనపై చర్చించింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, సామాన్యులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వరంగల్ రీజనల్ ఐ హాస్పిటల్‌ను అత్యాధునిక వైద్య సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రోగులకు మెరుగైన సేవలందించడమే కాకుండా, ఆసుపత్రిని అన్ని విధాలా బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నామన్నారు. సిబ్బంది కొరత లేకుండా, అవసరమైన వైద్య పరికరాలను వెంటనే అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడారు.

# టెక్నాలజీతో దొంగల గుట్టురట్టు

- రూ.2.40 లక్షల వెండి సామగ్రి, కారు స్వాధీనం



అక్షరదర్బార్, ఆత్మకూరు: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పోలీసులు ఒక భారీ ఆలయ చోరీ కేసును కేవలం 24 గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఇద్దరు అంతర్రాష్ట్ర నేరస్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి సుమారు రూ. 2 లక్షల 40 వేల విలువైన 1080 గ్రాముల వెండి సామాగ్రితో పాటు, చోరీకి ఉపయోగించిన ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలను పరకాల ఏసీపీ సతీష్ బాబు మీడియాకు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరం ప్రాంతానికి చెందిన కల్లకూరి కిరణ్ బాబు, అనంతపూర్ జిల్లాకు చెందిన సందీప్ కుమార్ ఇద్దరూ అంతర్రాష్ట్ర దొంగలు. వీరు ఈనెల 18వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడెప్పాడు గ్రామంలో గల ఆలయంలో చొరబడి, అక్కడి వెండి సామాగ్రిని దొంగిలించారు. ఈ ఘటనపై ఆలయ నిర్వాహకులు ఫిర్యాదు చేయడంతో ఆత్మకూరు పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు.

**వాహన తనిఖీల్లో దొరికిపోయిన దొంగలు..**

కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు.. తమకు అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీని (సీసీటీవీ, సైబర్ సెల్ సాయంతో) ఉపయోగించి నిందితులను తక్కువ సమయంలోనే గుర్తించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఆత్మకూరు మండల కేంద్రంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా, ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరు అంతరాష్ట్ర దొంగలు పోలీసులకు చిక్కారు.

**ఒక్కడిపైనే 50కి పైగా కేసులు**

పోలీసుల ప్రాథమిక విచారణలో ఒక షాకింగ్ నిజం బయటపడింది. పట్టుబడిన నిందితుల్లో ఒకడైన కిరణ్ బాబు సాదాసీదా దొంగ కాదని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి మొత్తం 50కి పైగా చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే కేసును ఛేదించి, నిందితులను పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఆత్మకూర్ ఇన్ స్పెక్టర్ సంతోష్, అతని సిబ్బందిని ఏసీపీ సతీష్ బాబు ప్రత్యేకంగా అభినందించారు.

# యువతే భవిష్యత్‌కు దారిదీపం

- అడిషనల్ కలెక్టర్ ఎన్ రవి
- యూత్ లీడర్‌షిప్ సమ్మిట్ ఘనంగా నిర్వహణ
- యూత్ పార్లమెంట్, పెయింటింగ్ పోటీల్లో యువత ఉత్సాహం




అక్షరదర్బార్, హనుమకొండ: యువతే భవిష్యత్‌కు దారిదీపమని హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఎన్ రవి అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న యువజన, క్రీడల వారోత్సవాల్లో భాగంగా బుధవారం హనుమకొండ యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో "యూత్ లీడర్‌షిప్ సమ్మిట్ – లీడ్ విత్ విజన్, ఇన్‌స్పైర్ ది ఫ్యూచర్" కార్యక్రమాన్ని హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. హనుమకొండ యువజన క్రీడా అధికారి కొత్త ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ రవి హాజరై మాట్లాడారు. యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. యువత లక్ష్యసాధన దిశగా కృషి చేస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న యువజన కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన యూత్ పార్లమెంట్, పెయింటింగ్ పోటీలలో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. యువజన సమస్యలు, సామాజిక అంశాలపై యూత్ పార్లమెంట్‌లో విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా, పెయింటింగ్ పోటీల్లో సృజనాత్మకతను చాటారు. జాతీయ యువజన అవార్డు గ్రహీతలు మండల పరశురాములు, గంగోజుల నరేష్, ఆకులపల్లి మధు హాజరై యువతకు ప్రేరణాత్మక సందేశాలు ఇచ్చారు. ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మల్లయ్య హాజరై ప్రభుత్వ ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్, హనుమకొండ ఇంచార్జి నయీమ్, డీఎస్ఏ కోచ్ లు, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ స్టాఫ్, మహిళలు, యువకులు, విద్యార్థులు, సిబ్బంది, యువజనులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- వెన్నం శ్రీకాంత్ రెడ్డి

అక్షర దర్బార్, మహబూబాబాద్: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా పుస్తకాలతో స్నేహం చేసి విజ్ఞానాన్ని సంపాదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, సీనియర్ పాఠకుడు టీవీ రామనర్సయ్య, డిఎస్ఓ అప్పారావు, ఏ సి జి మందుల శ్రీరాములు, ఏ ఎస్ సి సంతోష్, ముక్క లక్ష్మణరావు, నరసింగ శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, గ్రంథపాలకులు జి విజేందర్, సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్, భూలక్ష్మి, యాదమ్మ, బాబా మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# అభివృద్ధి..ఆదాయ వృద్ధికి ల్యాండ్ పూలింగ్ దోహదం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- ఆత్మకూర్‌లో లేఅవుట్ ల్యాండ్ పూలింగ్ పనుల పరిశీలన

అక్షరదర్బార్, ఆత్మకూరు: జిల్లాలోని ఆత్మకూర్ మండల కేంద్రంలో కుడా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లేఅవుట్ ల్యాండ్ పూలింగ్ ను బుధవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు చేపడుతున్న ల్యాండ్ పూలింగ్, లేఅవుట్ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించి, పనులను మరింత సమర్థవంతంగా చేపట్టాలని పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా లేఅవుట్, రహదారులు, ప్లాటింగ్ పనులు ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నాయని అన్నారు. ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా ప్రజలు తమ భూములను అభివృద్ధి కోసం అందించడం వల్ల వారి భూముల విలువ పెరగడంతో పాటు ఆదాయం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన లేఅవుట్ ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, పట్టణాభివృద్ధిలో భాగంగా ప్రణాళికాబద్ధమైన లేఅవుట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో ఆధునిక లేఅవుట్‌లను అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా పీఓ అజిత్ రెడ్డి, స్థానిక సర్పంచ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కరోజే 3,828 మెట్రిక్ టన్నుల మక్కల తరలింపు!

**కలెక్టర్ స్నేహ శబరీష్ పక్కా ప్లాన్**

**ఎస్పీ డాక్టర్ శబరిష్ పోలీస్ బందోబస్తు**

అక్షర దర్బార్, మహబూబాబాద్: జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పక్కా ప్రణాళికతో మహబూబాబాద్ జిల్లాలో మక్కజొన్నల తరలింపు ప్రక్రియ రికార్డు స్థాయిలో సాగుతోంది. జిల్లాలోని 25 కొనుగోలు కేంద్రాలకు 25 మంది జిల్లాస్థాయి ప్రత్యేక అధికారులను నియమించి రవాణా, పోలీస్, రెవెన్యూ శాఖలను సమన్వయం చేయడంతో ఈరోజు ఒక్కరోజే అత్యధికంగా 3,828.150 మెట్రిక్ టన్నుల (76,563 బస్తాల) మక్కజొన్నలను గోదాములు, మిల్లులకు తరలించారు. ప్రతి గంటకు కలెక్టర్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ లారీలతో పాటు ట్రాక్టర్లు, డీసీఎంల ద్వారా రవాణాను వేగవంతం చేశారు. ఈ ప్రక్రియకు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ప్రత్యేక శ్రద్ధ వహించి అండగా నిలిచారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో ప్రతి ఇన్స్పెక్టర్, ఎస్సైలను నియమించారు.



## వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- సరస్వతి అంత్య పుష్కరాలపై పోలీస్ అధికారులతో సమీక్ష

అక్షరదర్బార్, భూపాలపల్లి: సరస్వతి అంత్య పుష్కరాలకు సుమారు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించను న్నట్లు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ వెల్లడించారు. గురువారం నుంచి సరస్వతి అంత్య పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం ఆయన పోలీస్ అధికారులకు బ్రీఫింగ్ నిర్వహించారు. మే 21 నుండి జూన్ 1 వరకు కాళేశ్వ రంలో జరిగే సరస్వతి అంత్య పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి బందోబస్తు ఏర్పాట్లపై విస్తృతంగా బ్రీఫింగ్ ఇచ్చారు. అనంతరం పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ, ఘాట్ల వద్ద భద్రత, పార్కింగ్ ప్రాంతాలు, హెలిప్యాడ్ భద్రత, క్యూ లైన్ల నిర్వహణ పరిశీలించారు. తప్పిపోయిన వారి సహాయక కేంద్రాలు, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదే శించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్, సీసీఎస్ టీమ్స్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. భక్తులు పోలీస్ శాఖకు సహక రించి సూచనలు పాటిస్తూ పుష్కరాలను సురక్షితంగా నిర్వహిం చుకోవాలని ఎస్పీ కోరారు.

## నరేగా, చేయూత సర్వేను వేగవంతం చేయాలి

**స్పెషల్ సీఎస్ దాన కిషోర్**

**జూలై 1 నుంచి 'వీబీజీ రామ్‌జీ' పథకం..**

**కార్మికుల సంఖ్య 20 లక్షలకు పెంచాలి**

అక్షర దర్బార్, మహబూబాబాద్: నరేగా పనులు, చేయూత పింఛన్ సర్వేను అత్యంత ప్రాధాన్యతగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ సచివాలయం నుంచి సెర్ప్ సీఈఓ దివ్య తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూ బాబాద్ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్నేహ శబరీష్ ఈ సమా వేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మాట్లాడుతూ.. నరేగా పథకం జూన్ 30తో ముగుస్తుందని, జూలై 1 నుంచి కొత్తగా వీబీజీ రామ్‌జీ పథకం అమల్లోకి వస్తుందని తెలిపారు. ఉపాధి కూలీల సంఖ్యను 20 లక్షలకు పెంచి, పనులను ఉదయం 5:30 నుండి 10:30 గంటల లోపే పూర్తి చేయాలన్నారు. రాబోయే 40 రోజుల్లో ఎంపీడీవోలు ఉపాధి పనులపైనే దృష్టి సారించి, అందుబాటులో ఉన్న రూ. 343.59 కోట్ల మెటీరియల్ నిధులను పూర్తిగా వినియోగించా లని ఆదేశించారు. అలాగే, పింఛన్ లబ్ధిదారులకు జరుగుతున్న 'లైవ్ అథెంటికేషన్' సర్వేను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. శ్రీనిధి రుణాల ఎన్‌పీఏలను సున్నా స్థాయికి తీసుకురావాలని, కుటుంబ పోషకుడిని కోల్పోయిన పేదలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద రూ. 20 వేల ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని దాన కిషోర్ స్పష్టం చేశారు.

# పీఎస్‌లో ఏసీబీ కలకలం

- రూ.30వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన మహిళా ఎస్సై!

అక్షరదర్బార్, హైదరాబాద్: నగరంలోని బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం దాడి జరిపారు. ఒక కేసు విషయమై బాధితుడి నుండి రూ.30,000 లంచం తీసుకుంటుండగా బోయినపల్లి పోలీస్ స్టేషన్ మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) నందితను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలోనే ఈ దాడి జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక వివాదాస్పద కేసులో బాధితుడికి అనుకూలంగా వ్యవహ రించడానికి, లేదా కేసు నుండి ఉపశమనం కలిగించడానికి ఎస్సై నందిత రూ.30,000 లంచం డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తం ఇచ్చుకోలేకపోయిన బాధితుడు, లంచం ఇవ్వడం ఇష్టం లేక నేరుగా అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.



-పక్కా ప్లాన్‌తో పట్టుకున్న అధికారులు..

బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ డీఎస్పీ నేతృత్వం లోని బృందం బుధవారం నిఘా ఏర్పాటు చేసింది. ముందస్తు వ్యూహం ప్రకారం.. బాధితుడు బోయి నపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎస్సై నందితకు కెమికల్ పూసిన నోట్లను రూ.30,000 అందజేశారు. ఆమె ఆ డబ్బును తీసుకుంటుండగా, అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ అధికా రులు ఒక్కసారిగా దాడి చేసి ఎస్సైని పట్టుకున్నారు. ఎస్సై నందిత చేతులకు రసాయన పరీక్షలు (ఫినాల్ఫ్తలీన్ టెస్ట్) నిర్వహించగా పాజిటివ్ అని తేలింది. ఆమె వద్ద నుండి లంచం సొమ్ము రూ.30 వేలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు సుమారు రెండు గంటలకు పైగా తనిఖీలు నిర్వహిం చారు. ఎస్సై నందిత డెస్క్, ఆమెకు సంబంధించిన రికార్డులను, లాగ్ బుక్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. లంచం తీసుకుంటూ దొరికిపోయిన మహిళా ఎస్సై నందితను అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు మీడియాకు వెల్లడించారు

# ప్రభుత్వ భూమి కబ్జా యత్నం భగ్నం!

- రూ. కోట్ల విలువైన బంచరాయి భూమిని కాపాడిన అధికారులు
- నిందితులపై సుబేదారి పీఎస్‌లో కేసు నమోదు



అక్షరదర్బార్, కాజీపేట: కాజీపేట మండలం శాయంపేట గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి కొందరు చేసిన ప్రయత్నాన్ని అధికారులు సమర్థవంతంగా తిప్పికొట్టారు. సర్వే నెం.23లో ఉన్న విలువైన బంచరాయి భూమిని రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు సమన్వ యంతో వ్యవహరించి పరిరక్షించినట్లు కాజీపేట తహశీ ల్దార్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సదరు ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా మైనింగ్ నిర్వహిం చడంతో అక్కడ భారీ గుంతలు ఏర్పడి, భూమి పూర్తిగా నిరు పయోగంగా మారింది. అయితే, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భద్రకాళి చెరువు పూడిక మట్టితో ఆ గుంతలను పూడ్చివేశారు. ప్రజాప్రయోజనార్థం ఉపయోగపడే విధంగా ఆ స్థలాన్ని ప్రభుత్వం ఎంతో శ్రమించి అభివృద్ధి చేసింది.

**దేవాలయం పేరుతో ఆక్రమణకు స్కెచ్..**

ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఈ విలువైన భూమిపై కొందరు స్థానిక భూబకాసురుల కన్ను పడింది. అధికారుల నుండి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా, దేవాలయం పేరును వాడుకుంటూ చట్టవిరుద్ధంగా ఆక్రమించేందుకు వ్యూహం రచించారు. అక్కడ వివాదాస్పద పరిస్థితులు సృష్టించి, ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించారు. భూ ఆక్రమణ ఉదంతాన్ని తీవ్రంగా పరిగణించిన రెవెన్యూ శాఖ అధికారులు.. పోలీస్ యంత్రాంగం, జీడబ్ల్యూఎంసీ డీఆర్ఎఫ్ బృందం, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి రంగంలోకి దిగారు. తక్షణ చర్యలు చేపట్టి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా శాంతిభద్రతలకు విఘాతం కలి గించిన సదరు వ్యక్తులపై ఈ నెల 19వ తేదీన సుబేదారి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తహశీల్దార్ వివ రించారు.

**కబ్జాకు దిగితే కఠిన చర్యలు తప్పవు**

"ప్రభుత్వ భూములు ప్రజా ఆస్తి. ఎవరైనా చట్టాన్ని అతిక్ర మించి ప్రభుత్వ భూములను ఆక్రమించినా, అన్యాక్రాంతం చేసినా లేదా చట్టవిరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా సహించేది లేదు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం" అని కాజీపేట తహశీల్దార్ రాజు హెచ్చరించారు.

## అత్యుత్తమ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అక్షర దర్బార్, మహబూబాబాద్: 2026-2027 విద్యా సంవత్సరానికి అత్యుత్తమ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ మరియు దివ్యాంగ విద్యార్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శ్రీనివాస రావు తెలిపారు. మార్చి 2026 పదో తరగతి పరీక్షల్లో 7.0 జీపీఏ మరియు ఆపై గ్రేడు సాధించి, ప్రభుత్వ, ఎయిడెడ్, రెసిడెన్షియల్ బడుల్లో చదివిన విద్యార్థులు దీనికి అర్హులన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ఎస్సీ, ఎస్టీలకు రూ. 2.00 లక్షలు, ఇతరులకు రూ. 1.00 లక్ష మించరాదని స్పష్టం చేశారు. అర్హులైన విద్యార్థులు మే 21 నుండి జూన్ 5 వరకు ఈ-పాస్ వెబ్‌సైట్ (https://telanganaepass.cgg.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు బెస్ట్ మెమో, ఆధార్, రేషన్ కార్డు, మీ-సేవా కుల, ఆదాయ పత్రాలు, బ్యాంకు పాస్ బుక్ మరియు ఫోటో జత చేయాలన్నారు. దరఖాస్తు సమయంలో ప్రాధాన్యత క్రమంలో మూడు కళాశాలలను ఎంపిక చేసుకోవాలని, గడువు ముగిసిన తర్వాత ఈ-పాస్ సిస్టమ్ ద్వారా ఆటోమేటిక్‌గా సీట్ల కేటాయింపు జరుగు తుందని శ్రీనివాస రావు వివరించారు.





## వైభవంగా సరస్వతీ అంత్య పుష్కరాలు

### రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్: సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మే 21 నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు ఆరోగ్యం కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ పుష్కర శుభాకాంక్షలు తెలిపారు.

# కాళేశ్వర తీరంలో ఆధ్యాత్మిక శోభ



## నదీ తీరంలో 100 మంది గజ ఈతగాళ్లు

పుష్కర స్నానాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ప్రత్యేక శిక్షణ పొందిన 100 మంది గజ ఈతగాళ్లను, ఎస్ డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించింది. లైఫ్ జాకెట్లు, సేఫ్టీ బోట్లు, లైఫ్ రింగులను అందుబాటులో ఉంచారు. పుష్కర విశేషాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు వీలుగా ఈఓ కార్యాలయంలో ప్రత్యేక మీడియా సెంటర్ ను ఏర్పాటు చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి బుధవారం రాత్రి కాళేశ్వరం చేరుకున్నారు. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ బుధవారం రాత్రి కాళేశ్వరం సందర్శించి సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

# నేటి నుంచి సరస్వతీ అంత్య పుష్కరాలు

- కంచి పీఠాధిపతి తొలి పుణ్యస్నానంతో ప్రారంభం
- 12 రోజుల పాటు త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక వైభవం
- నిత్యం ఉదయం హోమాలు.. సాయంత్రం మహదా హారతి
- 30 నుంచి 40 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం
- 245 ఎకరాల విస్తీర్ణంలో 23 ప్రత్యేక పార్కింగ్ జోన్లు
- భక్తులు ఘాట్లకు చేరుకోవడానికి 90 ఉచిత షటిల్ బస్సులు
- 23 జోన్లలో స్పెషల్ మెడికల్ క్యాంపుల ఏర్పాటు
- రూ.1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం
- నది తీరంలో వంద మంది గజ ఈతగాళ్లు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
- -మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ అధికారులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన

అక్షరదర్బార్, కాళేశ్వరం : దక్షిణ గంగగా కీర్తించబడే కాళేశ్వర క్షేత్రం పుష్కర శోభను సంతరించుకుంది. భక్తజన కోటి ఎంతగానో ఎదురుచూస్తున్న 'సరస్వతీ అంత్య పుష్కరాలు' నేటి (మే 21) నుండి వైభవంగా ప్రారంభం కానున్నాయి. జూన్ 1వ తేదీ వరకు 12 రోజుల పాటు ఈ పుష్కర మహోత్సవాలు నిరంతరాయంగా సాగుతాయి. ఈ పవిత్ర పుష్కర స్నానాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 30.63 కోట్ల నిధులను కేటాయించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేసింది. పుష్కరాల తొలిరోజైన గురువారం తెల్లవారుజామున 5.43 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారు సరస్వతీ నదిలో తొలి పుణ్యస్నానం ఆచరించి, ఈ అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. 12 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ఒక ప్రముఖ పీఠాధిపతి పాల్గొని నదీ స్నానం చేయనున్నారు. నిత్యం ఉదయం వేళల్లో పవిత్ర హోమాలు, సాయంత్రం వేళల్లో నదీ మాతకు మహదా హారతి, తెప్పోత్సవంతో పాటు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



### ప్రత్యేక చలువ పందిళ్లు

గత ఏడాది జరిగిన ఆది పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. పుష్కర ఘాట్ల వద్ద భక్తుల పాదాలు కాలకుండా క్వయర్ మ్యాట్లు, ఎండ తగలకుండా చలువ పందిళ్లను వేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి కేంద్రాలతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. రూ.1.20 కోట్లతో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక మ్యూజియంను, రూ.30 లక్షలతో పునర్నిర్మించిన నాగేంద్ర స్వామి ఆలయాన్ని భక్తుల సందర్శనార్థం సిద్ధం చేశారు. 12 రోజుల్లో 30 నుండి 40 లక్షల మంది వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ అంచనా. భక్తులు ఘాట్లకు చేరుకోవడానికి 90 ఉచిత షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. 500 ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించి, 300 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించారు.

### 245 ఎకరాల్లో భారీ పార్కింగ్.. సీసీ కెమెరాల నిఘా

పుష్కరాలకు సుమారు 1.70 లక్షల వాహనాలు వస్తాయని అంచనా వేసిన అధికారులు 245 ఎకరాల విస్తీర్ణంలో 23 ప్రత్యేక పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేశారు. భక్తుల భద్రత కోసం ఘాట్లు, దేవాలయం, పార్కింగ్ ఏరియాల్లో 200 సీసీ కెమెరాలను అమర్చి నిరంతరం నిఘా ఉంచారు. రాత్రి వేళల్లో భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. భక్తుల ఆరోగ్య రక్షణ కోసం 23 జోన్లలో ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. 300 మంది డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది విధుల్లో ఉంటారు. అత్యవసర సేవల కోసం ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు. మహాదేవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెఫరల్ ఆసుపత్రిగా మార్చారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915